క్లుప్తంగా

ఉద్యోగనియామక పత్రం అందజేత



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ముస్లింపేటకు చెందిన షేక్ షబానాకు కారుణ్య నియామకం ద్వారా నియామక పత్రం జెడ్పీచైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా సోమవారం తన కార్యాలయంలో అందజేసినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని గరుడాచలపాలెంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ కరోనాతో మృతి చెందాడు. ఆయన భార్య షబానాకు కారుణ్యనియామకం ద్వారా నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా నియమిస్తూ ఉద్యోగ నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఉన్నారు.

చిన్నారికి సైకిల్ అందజేత



మంగళగిరి: వైఎస్సార్ సీపీ మంగళగిరి సోషల్ మీడియా కన్వీనర్ వ్యాసం అజయ్‌కుమార్ తన జన్మదినోత్సవం సందర్భంగా ఓ చిన్నారికి సైకిల్ అందజేశారు. నగరానికి చెందిన షేక్ జుబేరియా ఐదో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందిపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న సోషల్ మీడియా కన్వీనర్ వ్యాసం అజయ్‌కుమార్ తన జన్మదినోత్సవం సందర్భంగా సైకిల్‌ను కొనుగోలు చేసి ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా బాలికకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీమ్ ఆర్కే సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



మంగళగిరి: దుగ్గిరాల మండలం పెదకొండూరు, పెదపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణిల చేతుల మీదుగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పెదపాలెం, పెదకొండూరు గ్రామ సర్పంచ్‌లు పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఎం సౌజన్య, ఎంపీటీసీలు సుమన్, సాయికృష్ణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్యాపీఠంలో లక్ష రుద్రాక్షలతో శివపూజ

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో సోమవారం మహాశివునికి లక్ష రుద్రాక్షలతో బాలస్వామిజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శివునికి అభిషేకాలు, దీపోత్సవం భక్తులు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాథం, లలితా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలి రూరల్: వరకట్న వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ నాజరుపేటకు చెందిన వెంకటదుర్గకు దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన వెంకటగోపితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. అయితే తన భర్త కొద్దిరోజులుగా వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

క్లారినెట్ విద్వాంసుడికి సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం దక్షయజ్ఞం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం పెళ్లి చేసి చూడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు గానుగపెంట రంగనాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొల్లిపర రాఘవేంద్రరావు, పూసపాటి వెంకటేశ్వర్లు, ఈదర వెంకటపూర్ణచంద్, కె.చంద్రం, రావూరి హరీష్, శాఖమూరి చలపతిరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని,ఎన్టీఆర్ జగన్, ముప్పలనేని రాఘవరావు, ఉమ్మలనేని ధర్మారావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో గండాలయ స్వామికి వైభవం



గండాలయస్వామి ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు

- దాతల సహకారంతో అభివృద్ధి
- రూ.కోటితో జరుగుతున్న పనులు

మంగళగిరి: కొండపైకి వెళ్లి గండాలయస్వామికి దీపం పెడితే గాలైనా, వానైనా వెలుగుతూనే ఉంటుంది. గండాలయస్వామి మహత్యమని భక్తుల నమ్మకం. అంతటి ప్రాధాన్యం కలిగిన గండాలయ స్వామి(గండ దీపం) దశాబ్దాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని కొండపైకి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. దాతలు ముందుకు వచ్చి కొండపై అభివృద్ధి పనులు చేపట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొండపైకి ఒంటరిగా వెళ్లి దీపం పెట్టేందుకు సాధ్యపడేదు కాదు. అర్చకులు మాత్రమే శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవానికి వెళ్లి దీపం వెలిగించేవారు. దాతలు ముందుకు రావడంతో ఆలయానికి వసతులు సమకూరుతుండడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ప్రతి నెలా అమావస్య రోజున అధిక సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. దాతల సహకారంతో పానకాల లక్ష్మీనృసింహస్వామి వారి వద్ద నుంచి మెట్లు నిర్మించడంతో భక్తులు అధికసంఖ్యలో కొండపైకి చేరుకుని స్వామి వారిని దర్శించుకుంటున్నారు. మంగళగిరికి చెందిన 12 మంది దాతలు బృందంగా ఏర్పడి కొండపై గండదీప మండపం నిర్మాణానికి శ్రీకారచుట్టారు. రూ.65లక్షలతో పెద్ద పెద్ద బండరాళ్లను పైకి చేర్చి మండప నిర్మాణం చేపట్టారు. మరో మండప నిర్మాణానికి సుమారు రూ.కోటి ఖర్చు అవుతుందని అంచనా వేసిన అధికారులు మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.



నిర్మాణ పనులను పరిశీలించి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

రూ.36లక్షలతో షెడ్డు నిర్మాణం

అతి కష్టంపై కొండపైకి చేరుకున్న భక్తులు ఎండలో నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న భక్తుల కోసం మరో దాత ముందుకు వచ్చి రూ.36 లక్షలతో షెడ్డు నిర్మాణం చేపట్టారు. దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయం, పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండతో గండాలయ స్వామి కొండను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడంతో పాటు నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పరచడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు.



ప్రజాస్వామ్యపరిరక్షకుడు జగన్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బి.బ్రహ్మానందరెడ్డి

ఫిరంగిపురం: ప్రజాస్వామ్య పరిరక్షకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో సోమవారం కొత్తగా ఎంపికైన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించాడని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు అందేలా చేసేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది అందించిన సేవలు నిరుపమానమన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటింటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. సచివాలయ రీజనల్ కోఆర్డినేటర్ కె.రవీంద్రారెడ్డి మాట్లాడుతూ గృహసారథులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. అనంతరం మానమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, బి.అంజిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చిట్టా బాపూజిరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, మేడా బాబు, మెల్కియా, పి.మరియబాబు, జాకీర్‌లు పాల్గొన్నారు.



మానమ్మకం నువ్వేజగన్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

మేడికొండూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టే పలు రకాల పథకాలు, సేవలు మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ప్రజలకు చేరువ చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల జంక్షన్‌లో షిర్డిసాయి కల్యాణ మండపంలో సోమవారం కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనన్ని సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గృహసారథులు, మండల కన్వీనర్‌లు, వలంటీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

కన్వీనర్లు, గృహసారథుల జిల్లా కన్వీనర్ కందుల రవీంద్రారెడ్డి

మంగళగిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో 30 ఏళ్లు అధికారంలో ఉండేలా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి సమష్టిగా కృషి చేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల జిల్లా కన్వీనర్ కందుల రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఈద్గా కమ్యూనిటీ హాల్ ఆవరణలో మంగళగిరి పట్టణ, రూరల్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని 2024 ఎన్నికల్లో గెలిపించి హ్యాట్రిక్ సాధించాలన్నారు. మంగళగిరి రూరల్ గృహసారథుల కన్వీనర్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూడో సారి కూడా ఎమ్మెల్యే ఆర్కేను గెలిపించుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం కన్వీనర్ సంకె సునీత, జిల్లా మహిళా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపరాణి, నాయకులు గోలి కస్తూరి, విజయలక్ష్మి, ఆత్మకూరు మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి, పార్టీ నాయకులు జంగా నాగిరెడ్డి, గుండాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల జిల్లా కన్వీనర్ కందుల రవీంద్రారెడ్డి

ఎమ్మెల్యే శ్రీదేవిని కలిసిన అభివృద్ధి కమిటీ సభ్యులు



తాడికొండ: మేడికొండూరు గ్రామ ముస్లిం మైనార్టీ అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎన్నికైన నూతన కార్యవర్గం సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కమిటీకి సహకరించి ప్రభుత్వం నుంచి సహకారం అందించేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఏ సహకారం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు. అధ్యక్షుడుగా ఎన్నికైన అత్తర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు పటాలం ఆలీ, కోశాధికారి కొండవీటి ఖాజా మొహిద్దీన్ పలువురు సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని సన్మానించారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

- భక్తులు ప్రశాంతంగా నృసింహుని దర్శించుకోవాలి
- సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి
- దేవస్థాన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- నృసింహుని బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ
- 26 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: దేవుడు అందరి వాడని, స్వామి వారి వద్ద రాజకీయాలతో పనిలేకుండా భక్తులు ప్రశాంతంగా నృసింహస్వామి వారిని దర్శించుకునే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. ఈనెల 26 నుంచి మార్చి 9వ తేదీ వరకు జరగనున్న పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్, ఆహ్వాన పత్రికలను సోమవారం దేవస్థానం దిగువ సన్నిధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి ఆవిష్కరించారు. అనంతరం అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులతోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు విచ్చేయనున్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. దేవస్థానం వద్ద నుంచి చేపట్టే రథోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్డుకు ఏమైనా చిన్న చిన్న గుంతలు ఉన్నా మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. దేవస్థానం ప్రాంగణం చుట్టూ సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంతోపాటు దేవస్థానం పక్కనే ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టుకు అనుసంధానం చేసి నిరంతరం భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. దేవస్థాన పరిసర ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు భక్తులకు తెలియజేసేందుకు గుడ్డ బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థాన పరిసర ప్రాంతాల్లో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించవద్దని, పేపర్ గ్లాసులను గానీ, లేదా కుండలను ఏర్పాటు చేసి స్టీల్ గ్లాసులతో మాత్రమే భక్తులకు తాగునీటిని అందించాలని సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు పలువురు ఆధ్యాత్మిక ప్రతినిధులను ఆహ్వానించి వారితో భక్తులకు ఆధ్మాతిక సందేశాలను అందించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థాన పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా నిరంతరం కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానానికి సంబంధించిన కల్యాణ వేదిక మైదానాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా స్వామి వారి కల్యాణం తిలకించేలా చూడాలన్నారు. దేవస్థాన ప్రాంగణంలో వ్యాపార ప్రకటనలను ప్రోత్సహించవద్దని, స్వచ్ఛందంగా భక్తులకు సేవలు అందించేలా దాతలకు, స్వచ్ఛంద సంస్థలకు, ఆధ్యాత్మిక సంస్థలకు సూచించాలన్నారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆలయ ఈఓ ఎ రామకోటిరెడ్డి, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ బి అంకమ్మరావు, విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ నేరెళ్ల లక్ష్మీరాధిక తదితరులు పాల్గొన్నారు.

పెద కోనేరు అభివృద్ధి పనుల పరిశీలన

నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి పెద కోనేరు (కల్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పరిశీలించి త్వరితగతిన కోనేరు అభివృద్ధి పనులను పూర్తిచేసి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి తెప్పోత్సవానికి అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు.

72 బస్తాల రేషన్ బియ్యం గోల్‌మాల్

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- రాయపూడి, బోరుపాలెం గ్రామాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీ హరిరావు

తాడికొండ: తుళ్లూరు మండలంలో రేషన్ డీలర్లు పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని తప్పుదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్న వ్యవహారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులలో వెల్లడైంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ వి మాధవరెడ్డికి స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం దాడులు నిర్వహించారు. దాడులలో రాయపూడి గ్రామంలోని దుకాణం నెంబర్ 21లో తనిఖీలు నిర్వహించగా ఉండాల్సిన నిల్వ కంటే 41 బస్తాలు బియ్యం అంటే సుమారు 20 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. బోరుపాలెం గ్రామంలోని దుకాణం నంబర్ 19లో ఉండాల్సిన నిల్వ కంటే 51 బస్తాలు తక్కువ ఉన్నట్లు గుర్తించి డీలర్‌పై 6ఏ కేసులు నమోదు చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న స్టాకును సీజ్ చేసి స్వాధీన పరచుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. విజిలెన్స్ సీఐ ఎ శ్రీహరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో పౌరసరఫరాల అసిస్టెంట్ సప్లై అధికారి చల్లా లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో భారీగా రేషన్ బియ్యం మాఫియా

ముడుపులతో వ్యవస్థలను ప్రలోభ పెడుతున్న వ్యాపారికి పలువురి వత్తాసు

తుళ్లూరు మండలంలో రేషన్ బియ్యం మాఫియా వ్యాపారం భారీగా కొనసాగుతుంది. మందడం గ్రామానికి చెందిన అక్రమ రేషన్ బియ్యం రవాణా వ్యాపారి పట్టపగలే నేరుగా రేషన్ డీలర్ల వద్ద నుంచి బియ్యం వాహనాలలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గతంలో ఇతన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకొని భారీగా నిల్వలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. అయితే అన్ని వ్యవస్థలకు ముడుపులు చెల్లిస్తున్న సదరు వ్యాపారి కేసులు పెట్టే సమయంలో తనపై కాకుండా బినామీ వ్యక్తులను పెట్టి కేసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. డీలర్లను గుప్పెట్లో పెట్టుకొని జోరుగా రేషన్ బియ్యం తరలిస్తూ పెదకూరపాడు మండలంలోని ఓ గ్రామంలో తన కుమారుడుకు చెందిన రైసుమిల్లుకు తరలిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నాడు. గ్రామాల్లో డీలర్లు తమకు బియ్యం సక్రమంగా సరఫరా చేయడం లేదని పలు గ్రామాల నుంచి ప్రజలు నేరుగా డీఎస్‌వోకు ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేయడంతో స్పందించిన అధికారులు విజిలెన్స్ అధికారుల సహకారంతో దాడులు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అప్రమత్తమైన పలువురు డీలర్లు దాడులు జరుగుతున్న సమయంలోనే తమ స్టాకును సరిచేసుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఇంతా జరుగుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు రేషన్ బియ్యం మాఫియాను పట్టించుకో పోవడం పట్ల పలువురు పేదలు మండిపడుతున్నారు.

బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎం జగన్

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో బలహీనవర్గాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలబెట్టారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీల అభ్యర్థుల జాబితాపై చిరంజీవి స్పందిస్తూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 18 పదవులకుగానూ 11 స్థానాలను బీసీలకు, రెండు స్థానాలను ఎస్సీలకు, ఒక స్థానాన్ని ఎస్టీలకు కేటాయించి వెనుకబడిన వర్గాల సంక్షేమంపై తనకు ఉన్న చిత్తశుద్ధిని మరోమారు నిరూపించుకున్నారని చెప్పారు. అందులో చేనేత వర్గాలకు కూడా సముచిత స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. ఇది దేశంలోనే సరికొత్త చరిత్రకు నాంది అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత బలహీనవర్గాలను అందలం ఎక్కించి బీసీలు తలెత్తుకుని తిరిగేలా ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. ఇప్పటికే అత్యధిక మంది బీసీలను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా, కార్పొరేషన్ చైర్మన్లుగా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే కొన్ని రాజకీయపార్టీలు బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ ఆయా వర్గాలను దారుణంగా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు.

టిప్పర్ యజమానులకు జరిమానా

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ల యజమానులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర వద్ద తెనాలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలను సోమవారం నిర్వహించారు. అధిక లోడుతో వెళుతున్న రెండు టిప్పర్లను గుర్తించి వాటి యజమానులకు రూ. 14 వేల చొప్పున జరిమానా విధించారు.

దివ్యాంగ ఉద్యోగులకు తీపికబురు

గుంటూరు వెస్ట్: సీఎఫ్ఎంఎస్ పద్దు ద్వారా జీతం పొందే ప్రతి ఉద్యోగి తప్పని సరిగా ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదై ముఖ్య ఆధారిత హాజరు తప్పకుండా వేయాలని అయితే రాష్ట్ర పభుత్వం దివ్యాంగులకు మినహాయింపు నిచ్చిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసి మాట్లాడుతూ డీడీఓలు, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. యాప్‌లో ఎన్రోల్‌కు అటెండెన్స్‌కు సంబంధం లేదని చెప్పారు. సీఎఫ్ఎంఎస్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో ఎంతమందైనా ఎన్రోల్ అవ్వొచ్చని చెప్పారు. పాత నెంబర్ అందుబాటులో లేకపోతే కొత్త నెంబర్ ద్వారా ఎన్రోల్ చేసుకోవచ్చని చెప్పారు. సమస్యలను ఎన్ఐసీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళితే పరిష్కారమవుతుందన్నారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డీపీఓ ఎన్. వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖాధికారి రంగనాథ్ బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చేసిన ఘనత జగనన్నదే

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్

తాడికొండ: 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశ చరిత్రలో సామాజిక న్యాయం అంటే ఏంటో చేతల్లో చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం 18 మంది ఎమ్మెల్సీలను ప్రకటిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్పందించిన ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమన్నారు. సామాజిక అసమానతలు లేకుండా చేయడమే తన లక్ష్యం అంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సంక్షేమ పథకాలతోపాటు రాజకీయాల్లోనూ సమోన్నత అవకాశాలు కల్పిస్తూ జగనన్న తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయాల్లో పెను తుఫానుగా మారనుందన్నారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, వెన్నెముక అంటూ వారి అభ్యున్నతికి పెద్దపీట వేసిన జగనన్న 18 ఎమ్మెల్సీలలో 11 ఎమ్మెల్సీలు బీసీ వర్గాలకు కేటాయించి తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారన్నారు. ఓసీలకు కేవలం 4 స్థానాలు కల్పించి ఎస్సీ-2, ఎస్టీ-1 స్థానం కల్పించిన జగనన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికారం దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నాడనడంలో సందేహం లేదన్నారు. దేశంలో ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలు బడుగు బలహీనవర్గాల అభివృద్ధే తమ లక్ష్యం అంటూ ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తూ ప్రభుత్వాల్ని నడిపినా పేద వర్గాలకు ఎటువంటి ప్రయోజనం కలగలేదన్నారు. కానీ పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తూ అన్ని రంగాలలో బహుజనులకు కల్పిస్తున్న ప్రాధాన్యతే ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్ పదవులు, అన్ని రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 67 శాతం రిజర్వేసన్లు కల్పిస్తూ ఇందులో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు ఇస్తున్న జగనన్న మరో 30 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటాడనడంలో సందేహం లేదన్నారు. దేశంలోనే రోల్ మోడల్ ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకుంటూ వాటిని ఆచరణలో సైతం విజయవంతం చేస్తున్న జగనన్నను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటాయనడంలో సందేహం లేదన్నారు.

ఏసీఐసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్‌తో శ్రీనిధి కళాశాల ఎంఓయూ

మంగళగిరి: తాడేపల్లి నగర పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలోని ఏసీఐసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్‌తో ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్ శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సీఈఓ గోవిల్ అలోక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్‌యూలో జరిగిన అవగాహన ఒప్పంద కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈఓ గోవిల్ అలోక్, శ్రీనిధి కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ టామిలు ఇరువురు పరస్పర ఒప్పంద పత్రాలపైన సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో గ్రామీణ వికాసం, అభివృద్ధి కోసం అంకుర పరిశ్రమల ఏర్పాటుకు పరస్పర సహాయ సహకారాలు అందజేసుకోవడం జరుగుతుందని గోవిల్ అన్నారు. అంకుర పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన సహాయ సహకారాలను అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ (ఏసీఐసీ -కెఎల్) అందజేయనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యకు అనుసంధానం చేయడం ద్వారా అనేక నూతన ఆవిష్కరణలను సమాజానికి అందించవచ్చన్నారు. విద్యార్థులు తాము అభ్యసించిన విద్యకు సాంకేతికతను జోడించాలని సూచించారు.